సాక్షి
సంగారెడ్డి
బుధవారం । 1 । నవంబర్ । 2023





**చెరుకు రైతు.. బతుకు బరువు**

జహీరాబాద్ ప్రాంతంలో ఉన్న ట్రైడెంట్ చక్కెర కర్మాగార విధానాలు రైతాంగాన్ని తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయి.

వివరాలు 10లో ▸



**నామినేషన్ల పర్వానికి సిద్ధం**

నామినేషన్ల స్వీకరణకు సర్వం సిద్ధం చేశామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి దేవుజా అన్నారు.

వివరాలు 10లో ▸



**ఇందిర సేవలు చిరస్మరణీయం**

జిల్లావ్యాప్తంగా మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతిని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నిర్వహించారు.

వివరాలు 11లో ▸

## న్యూస్‌రీల్

### పటేల్ సేవలు మరువలేనివి



ప్రతిజ్ఞ చేస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, అధికారులు

సంగారెడ్డి టౌన్ : దేశ ఐక్యత, సమగ్రత, భద్రతను కాపాడటానికి అందరూ అంకిత భావంతో కృషి చేయాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా రాష్ట్రీయ ఏక్తా దివస్ కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో నిర్వహించారు. పటేల్, లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. అనంతరం అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞను చేయించారు. ''దేశ ఐకమత్యం కోసం అంకితభావంతో కృషి చేస్తాం. తోటి వారందరిలో ఈ భావన పెంపొందించేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తాం. పటేల్ దార్శనికతతో దేశానికి సమకూరిన అంతర్గత భద్రతను పటిష్ట పరిచేందుకు తోడ్పాటు అందిస్తాం'' అని ప్రతిజ్ఞ చేయించారు.

### జిల్లాలో 30, 30(ఎ) పోలీసు యాక్ట్

ఎస్పీ రూపేష్



సంగారెడ్డి : నవంబర్ 1 నుంచి 30వ తేదీ (నెల) వరకు జిల్లావ్యాప్తంగా 30, 30(ఎ) పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ సీహెచ్ రూపేష్ మంగళవారం తెలిపారు. జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. పోలీసుల ముందస్తు అనుమతి లేకుండా ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నేతలు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని పేర్కొన్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

### సేవలకు దక్కిన అవార్డు



వినయ పాటిల్‌కు సేవా పురస్కారం అందజేస్తున్న ఎంపీ బీబీ పాటిల్

జహీరాబాద్ టౌన్: ఎంపీ బీబీ పాటిల్ చేతుల మీదుగా పట్టణానికి చెందిన వినయ పాటిల్ ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. మంగళవారం తన జన్మదినం సందర్భంగా హైదరాబాద్‌లో పలువురికి జ్ఞాపికలు, సేవా రత్న అవార్డులను అందజేశారు. వినయ్ చేసిన పలు సేవలకు గాను ఈ పురస్కారం వరించింది.

### అన్ని సమస్యలు పరిష్కరిస్తాం

ఆర్టీసీ మెదక్ రీజినల్ ఆర్ఎం ప్రభులత



సంగారెడ్డి టౌన్ : ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆర్టీసీ మెదక్ రీజియన్ మేనేజర్ ప్రభులత అన్నారు. మంగళవారం మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమం జరిగింది. ప్రయాణికుల నుంచి వచ్చిన విజ్ఞప్తులను స్వీకరించారు. అందులో నారాయణఖేడ్ నుంచి బాన్సువాడ వయా సిర్గాపూర్.. పిట్లం మీదుగా బస్సు సౌకర్యం కల్పించాలని ఖేడ్‌కు చెందిన త్రినాయక్ కోరారు. సంగారెడ్డి నుంచి శంకర్‌పల్లికి సర్వీస్‌లను పెంచాలని ఎద్దుమైలారం గ్రామానికి చెందిన వీరయ్య తెలిపారు. మెదక్ నుంచి జేబీఎస్ రూట్లలో బస్సుల సంఖ్యను పెంచాలని మెదక్ వాసి శంకర్ విన్నవించారు. జేబీఎస్ నుంచి నిజామాబాద్, కామారెడ్డి.. ఎక్స్‌ప్రెస్, సూపర్ లగ్జరీ బస్సులు తూప్రాన్ బస్టాండ్‌లో ఆపేలా చర్యలు తీసుకోవాలని తూప్రాన్ వాసి శివ కృష్ణ తెలిపారు. సంగారెడ్డి నుంచి మాందాపురం మీదుగా సి. కోనాపూర్‌కు బస్సును ఇంకో ట్రిప్ రోజూ ఉదయం 9.30 గంటలకు వేయాలని మాందాపురానికి చెందిన అంజయ్య విజ్ఞప్తి చేశారు. సంగారెడ్డి టు వికారాబాద్‌కు బస్సులను నడపాలని సంగారెడ్డి నుంచి రాధ తెలిపారు. పటాన్‌చెరు టు సంగారెడ్డి రూట్లో రోజూ రాత్రి 9 గంటల సమయంలో బస్సును నడపాలని పటాన్‌చెరుకు చెందిన శ్రీనివాస్ చెప్పారు. స్పందించిన ఆర్ఎం వీటన్నింటినీ పరిష్కరిస్తామన్నారు.

# కదనరంగంలోకి కథానాయకులు

- ఆశీర్వాద సభలతో బీఆర్ఎస్, విజయభేరీలతో కాంగ్రెస్ జోరు
- అభ్యర్థులు ఖరారయ్యాక బీజేపీ షురూ



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : జిల్లాలో ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. ప్రధాన పార్టీలు జోరుగా ప్రచారంలో నిమగ్నమయ్యాయి. ఆయా పార్టీల జాతీయ నాయకులు, అధినేతల బహిరంగ సభల నిర్వహణతో ఉమ్మడి జిల్లాలో రాజకీయం వేడెక్కింది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆశీర్వాద సభ పేరిట హుస్నాబాద్ నుంచి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. అభ్యర్థుల జాబితాను సైతం ముందే ప్రకటించారు. పార్టీకి కంచుకోటగా ఉన్న సిద్దిపేటలో ఇటీవల భారీ బహిరంగ సభ నిర్వహించారు. తాజాగా నారాయణఖేడ్‌లో ఆశీర్వాద సభ జరిగింది. రాష్ట్రంలో జరిగిన ప్రగతిని వివరిస్తూ కేసీఆర్ ఓటర్లను ఆకట్టుకునేలా ప్రసంగాలు చేస్తున్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం అలాగే కొనసాగాలంటే మరోసారి అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మేనిఫెస్టోలో పొందుపర్చిన అంశాలను ముఖ్యమంత్రి ప్రజలకు వివరిస్తున్నారు. మరోవైపు కాంగ్రెస్‌పై ఘాటు విమర్శలు చేస్తున్నారు. ఎన్నికలు రాగానే ఆగం కావద్దని, ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు. ఎన్నికల షెడ్యూల్ రాక ముందే మెదక్‌లో సమీకృత కలెక్టరేట్ ప్రారంభోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ బహిరంగ సభను నిర్వహించింది. ఇలా వరుస బహిరంగ సభలు నిర్వహిస్తుండటం గులాబీ శ్రేణుల్లో జోష్ నింపుతోంది.

**కాంగ్రెస్ విజయభేరి సభలు**

ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ విజయభేరి బహిరంగ సభలను నిర్వహిస్తోంది. తాజాగా సంగారెడ్డిలో పార్టీ నిర్వహించిన సభకు ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే హాజరయ్యారు. ఆయనతోపాటు పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీనేత భట్టి విక్రమార్క పాల్గొన్నారు. మెదక్ జిల్లా కేంద్రంలోనూ ఇటీవల సభ జరిగింది. ఆయా కార్యక్రమాల్లో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేయనున్న ఆరు గ్యారంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. మరో వైపు కేసీఆర్ సర్కారు వైఫల్యాలను ఎత్తి చూపుతూ కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలోకి రావటం ఖాయమని వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

**ప్రచారంలో వెనుకపడ్డ బీజేపీ**

ఉమ్మడి జిల్లాలో ఉన్న పలు నియోజకవర్గాలకు బీజేపీ అభ్యర్థులను ఖరారు చేయలేదు. దీంతో ఈ పార్టీ ప్రచారం నెమ్మదిగా సాగుతోంది. కాగా విడుదలైన తొలిజాబితాలో గజ్వేల్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఈటల రాజేందర్ ప్రకటించగా, ఆయన ఇటీవల బహిరంగ సభ సైతం నిర్వహించారు. అందులో కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ ఒక్కటే అని తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. మరో వైపు దుబ్బాకలో పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి రఘునందన్‌రావు సైతం ప్రచారం నిర్వహిస్తున్నారు. కాగా ఉమ్మడి జిల్లాలో ఉన్న అన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థులను ఖరారు చేశాక బహిరంగ సభలను నిర్వహించే యోచనలో బీజేపీ ఉన్నట్లు ఆ పార్టీ శ్రేణులు భావిస్తున్నారు.

# 3 నుంచి నామినేషన్లు

**జిల్లా ఎన్నికల అధికారి శరత్**



మాట్లాడుతున్న కలెక్టర్ శరత్, ఎస్పీ రూపేష్

సంగారెడ్డి టౌన్ : ఎన్నికలు శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు జిల్లా యంత్రాంగానికి సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి శరత్ తెలిపారు. మంగళవారం ఎస్పీ రూపేష్‌తో కలిసి కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. నామినేషన్ల ప్రక్రియ, ఎన్నికల నిర్వహణ తదితరాలపై అవగాహన కల్పించారు. నవంబర్ 3న నోటిఫికేషన్ ప్రకటించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతోందన్నారు. నవంబర్ 10వ తేదీతో గడువు ముగుస్తోందని తెలిపారు. అభ్యర్థులు నామినేషన్లను ఆరోజు మధ్యాహ్నం 3 గంటల లోపు వేయాలన్నారు. అందుకు సంబంధించి నియమ నిబంధనలు, తదితరాలను వివరించారు. అదే నెల 30వ తేదీ పోలింగ్ వరకు చేసిన ఖర్చుల వివరాలు రిజిస్టర్లో అభ్యర్థుల ఏజెంట్లు నమోదు చేయాలన్నారు. ర్యాలీలు, బహిరంగ సభలు, సమావేశాల కోసం నేతలు తప్పనిసరిగా ముందస్తు అనుమతులు పొందాలని సూచించారు. ఎస్పీ రూపేష్ మాట్లాడుతూ జిల్లాలో మద్యం అక్రమ రవాణా అరికట్టడంతో పాటు బెల్టు షాపులను మూసేస్తామన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో రాజకీయ పార్టీల ప్రతినిధులు అధికారులకు, పోలీసులకు సహకరించాలని కోరారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఆర్ఓ నగేష్, సంబంధిత నోడల్ అధికారులు, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగపు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చిరుత సంచారం

- ముంగి గ్రామ శివారులో ప్రత్యక్షం
- భయాందోళనలో ప్రజలు
- ఆ ప్రాంతాన్ని పరిశీలించిన అటవీ అధికారులు
- అప్రమత్తంగా ఉండాలని సూచన



అటవీ శాఖ అధికారులకు వివరాలు తెలుపుతున్న స్థానికులు

న్యాల్‌కల్(జహీరాబాద్): చిరుత సంచారం ప్రజలను భయాందోళనకు గురిచేస్తోంది. మండల పరిధిలో ఉన్న ముంగి గ్రామశివారులో కనిపించిందని స్థానికులు చెబుతున్నారు. వారి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సురేశ్, మరికొందరు యువకులు మహీంద్రా కర్మాగారంలో విధులు ముగించుకొని సోమవారం రాత్రి బైక్‌పై ఇంటికి బయలుదేరారు. అర్ధరాత్రి 12 గంటల సమయంలో ముంగి గ్రామానికి వెళ్లే రోడ్డు పక్కన చిరుత కనిపించింది. భయాందోళనకు గురైన వారు బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి వద్దకు వెళ్లి ఈ విషయాన్ని తెలిపారు. కారు ద్వారా అందరూ ఆ ప్రాంతానికి చేరుకున్నారు. రోడ్డుపై చిరుత సంచరించడం తిలకించారు. ఆ తర్వాత ఇది మెల్లగా రైతు అనే శ్రీను పొలంలోకి వెళ్లడం అక్కడున్న గేదె, దూడలపై దాడి చేసేందుకు ప్రయత్నించడం, అక్కడున్న ఒక శునకం అరవడం ఆరంభించగా అదికాస్త పత్తి పొలాల వైపు వెళ్లి అదృశ్యం కావడం జరిగిపోయాయి. ఈ విషయాన్ని అటవీ శాఖ అధికారులకు గ్రామస్తులు తెలిపారు. వారు సైతం అక్కడికి చేరుకొని దాని ఆనవాళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అటవీ అధికారి శ్రీధర్‌రావు, జహీరాబాద్ ఫారెస్టు అధికారి రాధికారెడ్డి మాట్లాడుతూ, చిరుత సంచరిస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.

### బీజేపీని నమ్మితే కుక్కతోకతో గోదారి ఈదినట్లే

మంత్రి హరీశ్‌రావు

గజ్వేల్/వర్గల్: బీజేపీని నమ్ముకుంటే కుక్కతోక పట్టుకొని గోదారిని ఈదినట్లే అవుతుందని మంత్రి హరీశ్‌రావు అన్నారు. మంగళవారం వర్గల్ మండలం గౌరారంలో నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ రాష్ట్రంలో బీజేపీకి ఒకటి, రెండు సీట్లు కూడా గెలిచే పరిస్థితి లేదన్నారు. దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు ప్రజలకు ఎన్నో హామీలిచ్చి...ఒక్కటీ నెరవేర్చలేదని గుర్తు చేశారు. ఆ పార్టీ నేతలు చెప్పే అబద్దపు మాటలను నమ్మవద్దని సూచించారు. అభివృద్ధి, సంక్షేమంలో రాష్ట్రం ఆదర్శమని, దేశంలోనే అత్యధిక పింఛన్లను అందజేస్తున్నది తెలంగాణ మాత్రమేనని అన్నారు. మల్లన్నసాగర్ నిర్వాసితుల కోసం మున్సిపాలిటీ పరిధిలోని ఆర్అండ్ఆర్ కాలనీని అన్ని రకాల వసతులతో నిర్మించినట్లు చెప్పారు. నిర్వాసితులకు సంబంధించిన కొన్ని సమస్యలు ఇంకా పరిష్కరించాల్సి ఉందన్నారు. కొందరికి నష్ట పరిహారం చెక్కుల పంపిణీ విషయంలో సాంకేతిక సమస్యలు ఏర్పడ్డాయని తెలిపారు. మరికొందరికి కోర్టు కేసుల కారణంగా రిజిస్ట్రేషన్ చేయలేకపోయామన్నారు. పెండింగ్‌లో ఉన్న ఇళ్ల స్థలాల పంపిణీని పూర్తి చేస్తామన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన కోసం శిక్షణా కార్యక్రమాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు.

# అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు



మాణిక్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన పలువురు నాయకులు

**బీఆర్ఎస్ జహీరాబాద్ అభ్యర్థి మాణిక్‌రావు**

కోహీర్(జహీరాబాద్): సంక్షేమం, అభివృద్ధికి ఆకర్షితులైన పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని జహీరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి మాణిక్‌రావు పేర్కొన్నారు. ప్రజల నుంచి లభిస్తున్న ఆదరణ చూస్తే మరోసారి తప్పక ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం మండల కేంద్రంలో కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. కాగా సమావేశం జరిగే ప్రాంతానికి ర్యాలీ చేరుకుంది. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు రహమత్ అలీ సహా వంద మంది కార్యకర్తలతో మాణిక్‌రావు సమక్షంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహులు యాదవ్, నాయకులు స్రవంతి అరవింద రెడ్డి, వహీద్, కలీం, ఉమర్ అహమద్, సుభాష్ రెడ్డి, జావేద్, సంపత్‌కుమార్, ఇఫ్తేకార్, సాద్ తదితరులు పాల్గొన్నారు.

# దళితులకు వరం దళితబంధు

**బీఆర్ఎస్ అభ్యర్థి క్రాంతికిరణ్**



ఆత్మీయ సమ్మేళనంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న క్రాంతికిరణ్

పుల్‌కల్(అందోల్) : ప్రభుత్వం దళితుల అభ్యున్నతికి కృషి చేస్తోందని బీఆర్ఎస్ అభ్యర్థి క్రాంతికిరణ్ తెలిపారు. మండల పరిధిలోని బస్వాపూర్‌లో ఉన్న ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి దళిత ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దళిత బంధు పథకం దళితుల పాలిట వరమైందన్నారు. ఈ పథకం వల్ల నిరుపేద దళితుల్లో ఆత్మస్థైర్యం నింపిందని తెలిపారు. లబ్ధి పొందిన కుటుంబాలు ఆత్మవిశ్వాసంతో జీవనం సాగిస్తున్నాయని చెప్పారు. తెలంగాణ దళితులు ఆర్థిక స్వావలంబన కలిగి ఉన్నారన్నారు. బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఫారూక్ హుస్సేన్ ప్రసంగించారు. ముందుగా పలువురు దళితులు బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో పార్టీ దళిత నాయకులు రాహుల్ కిరణ్, విష్ణయ్య, ఇమ్మయ్య పాల్గొన్నారు.

# గెలుపెవరిది ?

**జిల్లాలో జోరుగా సర్వేలు**

- బరిలోకి దిగిన పలు సంస్థలు
- అధికార, ప్రతిపక్ష పార్టీలు కూడా..



మెదక్: ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపోటములపై జిల్లాలో సర్వే టీమ్‌లు జోరుగా సర్వేలు నిర్వహిస్తున్నాయి. పలురాజకీయ పార్టీలతో పాటు ప్రైవేట్ ఏజెన్సీలు సైతం బరిలోకి దిగాయి. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలు, జరిగిన అభివృద్ధి, స్థానిక ఎమ్మెల్యే అందుబాటులో ఉంటున్నారా, గతంలో పాలకులు ఇచ్చిన హామీలను నెరవేర్చారా, అనే పలు రకాల ప్రశ్నలను ఓటర్లను అడుగుతూ సర్వేలు చేస్తున్నారు. ప్రతిపక్ష పార్టీలు కూడా అధికార పార్టీపై ఉన్న వ్యతిరేకతను ఏవిధంగా ప్రజలకు వివరించాలి అనేది తెలుసుకోవడానికి కూడా వారు సర్వే సంస్థలను ఆశ్రయిస్తున్నారు. దీంతో జిల్లాలో జోరుగా సర్వేలు కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలోని మెదక్, నర్సాపూర్, సంగారెడ్డి నియోజకవర్గాలలో ఈ సర్వే పూర్తి అయినట్లు పలు సర్వే టీమ్‌లు చెబుతున్నాయి. వారు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నియోజకవర్గాల్లోని గ్రామాల్లో తిరుగుతున్నారు. రైతులు, పింఛన్‌దారులు, ఒంటరి మహిళలు, విద్యావేత్తలు, నిరుద్యోగులు, ఉద్యోగులు, వైద్యులు, ప్రైవేట్ ఉద్యోగులతో పాటు పలు కులసంఘాల వారిని సర్వే నిర్వాహకులు కలిసి సమాచారాన్ని రాబడుతున్నారు. ప్రధానంగా నిరుద్యోగులు, విద్యావేత్తలు, ఉద్యోగాలకు సిద్ధమౌతున్న వారు ప్రభుత్వంపై వ్యతిరేకంగా ఉనట్లు సర్వే నిర్వాహకులు పేర్కొంటున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో ఓ నిరుద్యోగ యువత గ్రూప్–2 పరీక్ష వాయిదా పడడంతో ఆత్మహత్య చేసుకున్న విషయంతో పాటు గ్రూప్ పరీక్ష పేపర్ల లీకేజీలు, గ్రూప్–2 పరీక్ష వాయిదా పడడం, పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో సెలక్ట్ అయినప్పటికీ ఆ అంశం కోర్టులో పెండింగ్ ఉండడాన్ని ఎత్తిచూపుతూ పలు అంశాలపై ప్రభుత్వంపై అసహనం వ్యక్తం చేస్తునట్లు తెలిసింది. జిల్లాలో ప్రస్తుతం 2–3 సర్వే టీమ్‌లు ఆయా నియోజకవర్గాల్లో తిరిగి సర్వేలు చేస్తూ సాయంత్రానికి మెదక్ వచ్చి పలు లాడ్జీలలో ఉంటున్నారు. ఆయా టీమ్ సభ్యులతో మాట్లాడి విషయాలు తెలుసుకునేందుకు చాలా మంది నేతలు, కార్యకర్తలు పోటీ పడుతున్నారు.

# మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



ధ్రువపత్రాలను అందజేస్తున్న నాబార్డ్ ఏజీఎం

**ఉమ్మడి జిల్లా నాబార్డ్ ఏజీఎం తిమోతి**

పెద్దశంకరంపేట(మెదక్): నాబార్డు సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి జిల్లా నాబార్డ్ ఏజీఎం సిసిల్ తిమోతి అన్నారు. మంగళవారం పెద్దశంకరంపేటలోని స్త్రీశక్తి భవన్‌లో నాబార్డ్ ఆధ్వర్యంలో మగ్గం వర్క్ శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ధ్రువపత్రాలను అందజేశారు. మహిళలు శిక్షణ ద్వారా ఆర్థికంగా బలపడాలని, సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా నైపుణ్యం పెంచుకోవాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సదుపాయాలను వినియోగించుకోవాలని ఆయన వారికి సూచించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ మేనేజర్‌లు అతుల్‌కుమార్, నవీన్‌కుమార్, ఐకేపీ ఏపీయం గోపాల్, సీసీలు నిరంజన్, యోహాన్, సునీత, సిబ్బంది సాయిరెడ్డి, స్వరూప తదితరులున్నారు.

# ఉల్లి సాగు ఇక భారమే

- ఎకరా పెట్టుబడి రూ.50 వేలకుపైనే
- మనూరులో 1800 ఎకరాల్లో సాగైందన్న హార్టికల్చర్ అధికారులు

ఉల్లి సాగు భారంగా మారింది. నారు కొనుగోలు చేయడం ద్వారా పెట్టుబడి అధికం అవుతోంది. అదే విత్తనాలు కొని సాగు చేసుకుంటే కొంతవరకు భారం తగ్గే అవకాశం లేకపోలేదు. అయితే రైతులు నారు సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. వారి అవసరాన్ని ఆసరాగా తీసుకొని వాటి ధర పెంచి విక్రయిస్తుండటం కూడా ఒక కారణం అని చెప్పొచ్చు.



సాగులో ఉన్న ఉల్లి

మనూరు(నారాయణఖేడ్): నారాయణఖేడ్ డివిజన్ పరిధిలో ఉన్న మనూరు మండలం ఉల్లి సాగుకు ప్రసిద్ధి. ఈ ఏడాది కూడా పంట 1,500 నుంచి 1,800 ఎకరాల వరకు సాగైందని హార్టికల్చర్ అధికారులు చెబుతున్నారు. మనూరు ఏరియా పరిధిలో ఉన్న రేగోడ్, రాయికోడ్, జహీరాబాద్‌లో సైతం సాగు చేస్తున్నారు.

కాగా ఉల్లి నాట్ల కోసం వేసిన నారు నెలక్రితం కురిసిన భారీ వర్షాల కారణంగా ఇప్పుడు కొద్ది మేర చేతికి వచ్చింది. బోర్ల, బావుల కింద సాగు చేసిన నారు కూడా మొలకెత్తింది. అయితే బహిరంగ మార్కెట్‌లో ఈ నారును రైతులు స్థానికంగా విక్రయిస్తుంటారు. ఎకరా నారు రూ.10 వేల వరకు అమ్ముతున్నారు. చేసేదిలేక అంత ధర పెట్టి కొనుగోలు చేస్తున్నామని కాగా పెట్టుబడి భారంగా మారుతోందని రైతులు అంటున్నారు.

**సాగు భారంగా మారింది**

ఉల్లి రైతులకు ప్రస్తుత సీజన్‌లో సాగు భారంగా పెరిగిందని రైతులు అంటున్నారు. ఎకరా ఉల్లి సాగుకు రూ.50 వేలకు పైగా పెట్టుబడి పెట్టాల్సి ఉంటుందని ఆవేదన చెందుతున్నారు. ఎకరా ఉల్లి అచ్చుకట్టడానికి ఆరు వేలు, నాట్లు వేయడానికి రూ.10వేలు, అడుగుమందులకు రూ.10వేలు, పైమందులకు నాలుగు వేలు, నారుకు రూ.25 వేల నుంచి 35 వరకు ఖర్చు అవుతోందని వీటితోపాటు కోతలు, మార్కెట్‌కు తరలింపు వంటివి సైతం ఉంటాయని రైతులు పేర్కొంటున్నారు. ఇలా ప్రతి ఏడాదీ పెట్టుబడి పెరిగిపోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట చేతికొచ్చాక మార్కెట్‌లో సరైన ధర లేకపోతే తమ పరిస్థితి అగమ్యగోచరంగా మారే అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వం కింటాలుకు రూ.2 వేల వరకు మద్దతు ప్రకటించాలని అంటున్నారు.

**పక్క రాష్ట్రాల నుంచి విత్తనాలు**

ఖేడ్ ప్రాంతం కర్ణాటక, మహారాష్ట్రకు సరిహద్దు. దీంతో ఇక్కడి రైతులు ఉల్లి విత్తనాల కోసం మహారాష్ట్రలో ఉన్న నాందేడ్, పండరిపూర్, సోలాపూర్, కర్ణాటకలోని బీదర్, హుమ్నాబాద్ తదితర ప్రాంతాలకు తరలివెళ్లి ఇక్కడ రైతుల నుంచి విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. కిలో విత్తనాలు రూ.2,500 నుంచి 3 వేల వరకు ధర ఉందని రైతులు పేర్కొంటున్నారు.

**సబ్సిడీ విత్తనాలు అందించాలి**



ఉల్లి సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం సబ్సిడీ విత్తనాలు అందించాలి. దీంతో ప్రైవేట్‌లో వాటి ధర తక్కువగా ఉంటుంది. సబ్సిడీ విత్తనాలు లేకపోవడంతో ధరలు పెరగడంతోపాటు ఇతర రాష్ట్రాలకు వెళ్లి మేము తెచ్చుకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ఇకనైన సంబంధిత అధికారులు, నాయకులు దృష్టిని సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. –శివాజిరావు, రైతు, మాయికోడ్

**రైతులకు సూచనలిస్తున్నాం**



ఉల్లి సాగు చేస్తున్న రైతులకు మా వంతు సూచనలు, సలహాలు అందిస్తున్నాం. సాగులో తీసుకోవాల్సిన మెలకువలు, అధిక దిగుబడులు సాధించేందుకు తీసుకోవాల్సిన జాగ్రతలు వంటి అంశాలను సంబంధిత హార్టికల్చర్, అగ్రికల్చర్ ఏఈఓలతో సమన్వయంతో రైతులకు సలహాలు అందిస్తున్నాం.

–శ్రీనివాస్‌రెడ్డి, ఏఓ, మనూరు

## క్లుప్తంగా

### డిపాజిట్లు గల్లంతే



బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు

మునిపల్లి(అందోల్): ప్రజల దీవెనలతో కేసీఆర్ మూడోసారి సీఎం కావడం ఖాయమని అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం మండలంలోని అంతారం జీవన్ముక్త సంస్థానంలో పాండురంగ విఠలేశ్వర, రుక్మాబాయి దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అంతకుముందు మల్లికార్జునపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు పోచారం యాదమ్మ, సురేష్, కర్నార్ల కేశవరావు, మ్యాతరి కుమార్, తాలెల్మ మల్లయ్యతో పాటు తదితరులు గులాబీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేసీఆర్ ప్రవేశపెట్టిన పలు సంక్షేమ పథకాలను కేంద్రంతో పాటు ఇతర రాష్ట్రాల సీఎంలు కూడా అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ అసెంబ్లీ ఎన్నికలలో ప్రతిపక్షాలకు డిపాజిట్లు కూడా దక్కవని హితువు పలికారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మీనాక్షి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయికుమార్, శంకర్, విజయ్‌కుమార్, రాజు, కార్తీక్, యేసు, చిన్నమల్లయ్య, బుచ్చయ్య, నాగేశ్ పాల్గొన్నారు.

### బీఆర్‌ఎస్‌తోనే సంక్షేమం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు

జహీరాబాద్: బీఆర్‌ఎస్‌తోనే ప్రజా సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు అన్నారు. మంగళవారం శేఖాపూర్, లచ్చానాయక్, ఆనెగుంట, అర్జున్‌నాయక్ తండాల్లో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ వై.నరోత్తం, ఐడీసీ చైర్మన్ ఎండీ.తన్వీర్, నియోజకవర్గ కోఆర్డినేటర్ దేవిప్రసాద్‌లతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తొమ్మిదేళ్ల నుంచి సీఎం కేసీఆర్ అన్నివర్గాల సంక్షేమం కోసం పాటుపడ్డారని తెలిపారు. కాంగ్రెస్ కల్లబొల్లి మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. కార్యక్రమంలో డీఆర్‌యూసీసీ సభ్యుడు షేక్ ఫరీద్, శంకర్ నాయక్, గుండప్ప, పెంటారెడ్డి, మచ్చేందర్, శెట్టి రాథోడ్, హీరూ రాథోడ్ పాల్గొన్నారు.

### ఆరు గ్యారంటీలతో అధికారంలోకి..



మాట్లాడుతున్న చంద్రశేఖర్

జహీరాబాద్: కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలతో అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ అభ్యర్థి ఏ.చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం మండలంలోని హోతి(కె), నాగిరెడ్డి, శేఖాపూర్ తండాలలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపిస్తే రేషన్‌కార్డు ఉన్న మహిళలందరికీ ప్రతినెలా రూ.2,500 అందిస్తామన్నారు. రైతు కూలీలకు సంవత్సరానికి రూ.12వేలు, ఆడబిడ్డల పెళ్లిళ్లకు రూ.లక్ష నగదుతో పాటు తులం బంగారం అందిస్తామన్నారు. దశాబ్దకాలం అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం రుణమాఫీ చేయకుండా రైతులను మోసం చేసిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నాగిరెడ్డి రాథోడ్, పార్టీ మండల అధ్యక్షుడు పి.నర్సింహారెడ్డి పాల్గొన్నారు.



# చెరుకు రైతు.. బతుకు బరువు



సాక్షి ఆధ్వర్యంలో నిర్వహించిన పీపుల్స్ ఎజెండా కార్యక్రమంలో పాల్గొన్న చెరకు రైతులు

- సాగు నుంచి క్రషింగ్ వరకు అన్నీ అవస్థలే..
- కష్టంగా మారిన పంట అమ్మకం
- అమ్మినా.. బిల్లులు అందక అష్టకష్టాలు
- అప్పులకు వడ్డీలు కట్టలేక ఆవేదన
- వచ్చే సీజన్‌లో క్రషింగ్‌పై అనుమానాలు
- సమస్యలు పరిష్కరించాలని రైతుల వేడుకోలు

సాక్షి పీపుల్స్ ఎజెండా

జహీరాబాద్: జహీరాబాద్ ప్రాంతంలో ఉన్న ట్రైడెంట్ చక్కెర కర్మాగార విధానాలు రైతాంగాన్ని తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. పంట సాగు నుంచి క్రషింగ్‌కు తరలించే వరకు అనేక ఇబ్బందులు పడుతున్నా ఫలితం అందుకు అనుగుణంగా ఉండడం లేదని రైతులు వాపోతున్నారు. ఈ కర్మాగారంపై ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 20వేల మంది ఆధారపడి ఉన్నారు. సుమారు 6500 మంది రైతులు చెరకు పంటను సాగు చేస్తున్నారు. 2022–23 క్రషింగ్ సీజన్‌కు గాను రైతులు కర్మాగారానికి చెరకు పంటను సరఫరా చేశారు. అయినా యాజమాన్యం పూర్తి స్థాయిలో బిల్లులు చెల్లించక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. యాజమాన్యం రూ.9కోట్ల మేర బకాయి పడింది. 2023–24 క్రషింగ్ సీజన్ మరో వారం రోజుల్లో ప్రారంభం కాబోతున్నా గత ఏడాది బిల్లులు ఇంకా చెల్లించలేదు. దీంతో రైతులు పెట్టుబడుల కోసం తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగిపోయి అష్టకష్టాలు పడుతున్నారు. క్రషింగ్ కోసం ఏర్పాట్లు కూడా చేపట్టడం లేదని ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి తమ ఇబ్బందులను దూరం చేయాలని చెరకు రైతులు కోరుతున్నారు.

#### ఉద్యమాలు చేసినా సమస్య తీరలే



చెరకు బకాయిల కోసం ఉద్యమాలు చేపట్టినా ప్రభుత్వం, యాజమాన్యం స్పందించడం లేదు. జిల్లా మంత్రి కూడ పట్టించుకోవడం లేదు. యాజమాన్యం నుంచి రైతులకు రూ.9కోట్ల బకాయి పడింది. వీటిని వెంటనే చెల్లించి రైతులను ఆదుకోవాలి.

–జి.కొండల్‌రెడ్డి, రైతుసంఘం నాయకుడు, జహీరాబాద్

#### ఇబ్బంది పడుతున్నాం



చెరకు సాగు కోసం అప్పులు చేశాం. బకాయిలు చెల్లించక పోవడంతో వడ్డీలు పెరిగిపోతున్నాయి. రూ.3లక్షల వరకు రావాల్సి ఉంది. కర్మాగారంలో ఉత్పత్తి అయిన చక్కెర, మొలాసిస్‌ను యాజమాన్యం అమ్ముకున్నా బిల్లులు చెల్లించక పోవడం అన్యాయం.

–బి.జైపాల్‌రెడ్డి, రైతు, మిర్జాపూర్, న్యాల్‌కల్ మండలం

#### క్రషింగ్ నిర్వహించడం అనుమానంగానే ఉంది



ఈ ఏడాది కర్మాగారంలో క్రషింగ్ ప్రారంభించడం అనుమానంగానే ఉంది. పూర్తి స్థాయిలో మరమ్మతులు కొనసాగడం లేదు. కర్మాగారం యంత్రాలు స్క్రాప్ కింద అమ్మకం పెడుతున్నారనే ప్రచారం సాగుతున్నది. కర్మాగారంలో కరెంటు సరఫరా కూడ లేదు.

–సి.గుండ్‌రెడ్డి, రైతు, మామిడ్గి, న్యాల్‌కల్ మండలం

#### క్రషింగ్ కొనసాగించాలి



ఈ ఏడాది కర్మాగారంలో క్రషింగ్‌ను ప్రారంభించాలి. సీజన్ దగ్గర పడుతున్నా కర్మాగారంలో చేపట్టిన మరమ్మతులు సక్రమంగా కొనసాగడం లేదు. క్రషింగ్ చేపడితేనే ఇతర కర్మాగారాలు గిట్టుబాటు ధర చెల్లించి కొనుగోలు చేస్తాయి. లేదంటే తీవ్రంగా నష్టపోతాం.

–బి.మాధవరెడ్డి, రైతు, జహీరాబాద్

#### పెట్టుబడికి అప్పు పుట్టడం లేదు



కొత్తగా చెరకు పంటను సాగు చేసుకునేందుకు పెట్టుబడుల కోసం అప్పులు పుట్టడం లేదు. గతంలో చేసిన అప్పులకు రెండేళ్లుగా వడ్డీలు కడుతున్నాం. సకాలంలో కూలీ డబ్బులు ఇవ్వక పోవడంతో కూలీలు కూడ పనులకు రావడం లేదు.

–డి.రామకృష్ణారెడ్డి, రైతు, అల్గోల్, జహీరాబాద్ మండలం

#### నమ్మకం లేక పక్క కర్మాగారాలకు



ఇక్కడి కర్మాగారంపై నమ్మకం కుదరకే కర్ణాటకకు తరలించాల్సి వస్తుంది. యాజమాన్యం రైతులకు భరోసా ఇవ్వక పోవడంతో నమ్మకం కోల్పోతోంది. పక్క రాష్ట్రాల్లోని యాజమాన్యాలు బిల్లులు సకాలంలో చెల్లిస్తున్నాయి.

–ఆనందీశ్వర్, రైతు, వడ్డి, న్యాల్‌కల్ మండలం

#### వడ్డీ కట్టలేకపోతున్న



గత ఏడాది 1500 టన్నుల చెరకును సరఫరా చేశా. ఇంకా రూ.9.50 లక్షల మేర బకాయిలు రావాల్సి ఉంది. ఎన్ని సార్లు అడిగినా అధికారులు, యాజమాన్యం స్పందించడం లేదు. పెట్టుబడుల కోసం అప్పులు చేసి వడ్డీలు కట్టలేకపోతున్నం.

–కె.మధుసూదన్‌రెడ్డి, రైతు, అల్గోల్, జహీరాబాద్ మండలం

#### అగ్రిమెంట్ చేసుకోవడం లేదు



సాగులో ఉన్న పంటకు యాజమాన్యం అగ్రిమెంట్ చేసుకోవడం లేదు. క్రషింగ్ అనుమానంగానే ఉంది. కర్ణాటకలోని యాజమాన్యం అగ్రిమెంట్ కోసం ముందుకు వచ్చింది. దీంతో వారితో ఒప్పందం చేసుకోవాల్సిన పరిస్థితి ఉంది.

–నాగేశ్వర్‌రెడ్డి, రైతు,రంజోల్, జహీరాబాద్ మండలం

#### సబ్సిడీ మందులు ఇవ్వడం లేదు



చెరకు పంటలో కలుపు తొలగించేందుకు సీడీసీ తరఫున సబ్సిడీపై ఇచ్చే మందులను ఇవ్వడం లేదు. ఇచ్చినా మొక్కుబడిగానే ఉంటున్నాయి. చెరకు కష్టాలు తీరాలంటే ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలి.

–సలావుద్దీన్, రైతు, గోవింద్‌పూర్, జహీరాబాద్ మండలం

### స్టెప్పులేసిన బీజేపీ అభ్యర్థి



నృత్యం చేస్తున్న మురళీయాదవ్

నర్సాపూర్: నర్సాపూర్ బీజేపీ అభ్యర్థి మురళీయాదవ్ కళాకారులతో కలిసి స్టెప్పులేసి కార్యకర్తలను ఉత్సాహపరిచారు. మంగళవారం స్థానిక ఓ ఫంక్షన్ హాలులో పార్టీ ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, నియోజకవర్గ ఇన్‌చార్జి ఈశ్వర్‌సింగ్ ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో కళాకారులు ఆడిపాడుతుంటే.. వారితో కలిసి మురళీయాదవ్ కొద్దిసేపు నృత్యం చేశారు. దీంతో కార్యకర్తలు, నాయకులు ఉత్సాహంగా ఈలలు వేశారు.

### ఎంపీ గన్‌మెన్లకు ఎస్పీ అభినందన



గన్‌మెన్లను సన్మానిస్తున్న ఎస్పీ

సంగారెడ్డి: ప్రాణాలకు తెగించి ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డిని కాపాడిన పర్సనల్ సెక్యూరిటీ ఆఫీసర్స్ (గన్‌మెన్) ప్రభాకర్, గంగారాంలను ఎస్పీ రూపేష్ మంగళవారం రివార్డులు అందజేశారు. సూరంపల్లి గ్రామంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన మీటింగ్ అనంతరం ఎంపీ తన కారు వద్దకు చేరుకోగానే ఓ వ్యక్తి కత్తితో దాడి చేసిన విషయం తెలిసిందే. ఆ సమయంలో పక్కనే ఉన్న గన్‌మెన్స్ తక్షణమే స్పందించి అతన్ని అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో ప్రభాకర్ గాయపడ్డాడు. గన్‌మెన్లు అప్రమత్తం కావడంతో ఎంపీకి ప్రాణాపాయం తప్పింది. ఈ సందర్భంగా వారిని ఎస్పీ అభినందించారు.

# నామినేషన్ల పర్వానికి సర్వం సిద్ధం

- 3 నుంచి తహసీల్దార్ కార్యాలయంలో స్వీకరణ
- ఎన్నికల రిటర్నింగ్ అధికారి దేవుజా



ఎన్నికల రిటర్నింగ్ అధికారి దేవుజా



కార్యాలయంలో ఫిర్యాదు స్వీకరణ కేంద్రం

పటాన్‌చెరు టౌన్: నామినేషన్ల స్వీకరణకు సర్వం సిద్ధం చేశామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి దేవుజా అన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నవంబర్ 30వ తేదీన జరిగే అసెంబ్లీ ఎన్నికలకు నామినేషన్ ప్రక్రియ మరో రెండు రోజుల్లో ప్రారంభం కానుందని తెలిపారు. ఇందుకోసం పటాన్‌చెరు తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. నవంబర్ 3వ తేదీ నుంచి 10వ తేదీ వరకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్లు సమర్పించవచ్చని తెలిపారు. నవంబర్ 5 సెలవు రోజు కావడంతో నామినేషన్లు స్వీకరణ ఉండదని వివరించారు. 13న నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ 14, 15న మధ్యాహ్నం మూడు గంటలకు ఫైనల్ జాబితాను విడుదల చేయనున్నట్లు చెప్పారు. ఫిర్యాదుల కోసం 08455–242005కు సమాచారం ఇవ్వాలన్నారు.

**విధి విధానాలు**

✦ ఎమ్మెల్యేగా ఎన్నికల బరిలో ఉండే అభ్యర్థి తన నేరచరిత్ర, నమోదైన పోలీస్ కేసులతోపాటు కోర్టు విచారణలో ఉన్న కేసు వివరాలు భార్యా పిల్లలు స్థిర, చర ఆస్తులు, అప్పులు, బ్యాంకు డిపాజిట్, నగదు నిల్వలు వివరాలు కూడా సమర్పించాల్సి ఉంటుంది.

✦ నామినేషన్‌ను ఆన్‌లైన్‌లో నింపి.. వాటి జిరాక్స్ ప్రతులు సమర్పించాల్సి ఉంటుంది. ఒక అభ్యర్థి నాలుగు సెట్ల నామినేషన్ దాఖలు చేసుకోవచ్చు.

✦ నామినేషన్ ఫారాలను రిటర్నింగ్ అధికారి కార్యాలయం నుంచి పొందవచ్చు.

✦ నామినేషన్ పత్రంతోపాటు ఫారం -2బీ సమర్పించాలి. నామినేషన్ ఫారంలో ఫారం- 26 అఫిడవిట్ జతపరచాల్సి ఉంటుంది.

✦ రూ.10 నాన్ జ్యుడీషియల్ స్టాంప్ పేపర్ పై అఫిడవిట్‌ను సమర్పించాలి.

✦ అభ్యర్థి రెండు స్టాంపు సైజు ఫొటోలను ఇవ్వాలి. ఒకటి నామినేషన్ ఫారం పైన రెండోది అఫిడవిట్ పైన అతికించాలి.

✦ నామినేషన్ వేసే అభ్యర్థి ప్రత్యేకంగా ఒక బ్యాంకు ఖాతాను తెరిచి ఎన్నికల కోసం పెట్టే ఖర్చులు అందులో నుంచి చూపాలి.

✦ అభ్యర్థిని ప్రతిపాదించే వ్యక్తి అదే నియోజకవర్గానికి చెందిన వారై ఉండాలి. జాతీయ లేదా రాష్ట్ర గుర్తింపు పొందిన పార్టీ తరపున పోటీ చేసేవారు నామినేషన్ వేస్తే వారిని ఒకరు ప్రతిపాదిస్తే సరిపోతుంది. అదే స్వతంత్ర అభ్యర్థి అయితే పది మంది ప్రతిపాదించాల్సి ఉంటుంది.

✦ నామినేషన్ సమర్పించే సమయంలో అభ్యర్థితో పాటు నలుగురిని మాత్రమే కార్యాలయంలోనికి అనుమతిస్తారు.

✦ అభ్యర్థి అగ్రవర్ణం లేదా బీసీ అయి ఉంటే రూ.10 వేలు, ఎస్సీ ఎస్టీలకు రూ.5 వేలు డిపాజిట్ చెల్లించాలి. రుసుంను బ్యాంకు చలానా రూపంలో చెల్లించాలి. ఎస్సీ ఎస్టీ అభ్యర్థులు సంబంధిత అధికారి చేత కుల ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాలి.

## ప్రజల ప్రేమాభిమానాలతో మళ్లీ గెలుస్తా

**బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు**



ప్రచారం చేస్తున్న రఘునందన్‌రావు

దుబ్బాకటౌన్: చిల్లర రాజకీయాలు, కుట్రకుతంత్రాలు చేసే వ్యక్తిని కానని, దుబ్బాక ప్రజల ప్రేమాభిమానాలతో మళ్లీ గెలుస్తానని బీజేపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని దుంపలపల్లితో పాటు మండలంలోని అప్పనపల్లి, హాసన్‌మీరాపూర్ గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. తాను ఉప ఎన్నికల్లో గెలిచిన రెండున్నరేళ్లలో నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల బాగోగులు చూసుకుంటూ ముందుకు సాగుతున్నానన్నారు. పథకం ప్రకారం తనపై సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తున్నారని తెలిపారు. కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని, అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. తనను మరోసారి గెలిపిస్తే జనం కష్టసుఖాల్లో అండగా ఉంటానన్నారు.

## ఆ పార్టీలను నమ్మితే మునిగినట్లే..

**బీఆర్‌ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్**




బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులు, కార్యకర్తలు

సదాశివపేట(సంగారెడ్డి): నయవంచనకు కేరాఫ్ అడ్రస్ కాంగ్రెస్, బీజేపీలు అని, వాటిని నమ్మితే నట్టేట ముంచుతాయని సంగారెడ్డి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చింతా ప్రభాకర్ ఆరోపించారు. మంగళవారం శివరాజ్‌పాటిల్ ఆధ్వర్యంలో 100 మంది బీజేపీ నాయకులు, కార్యకర్తలు గులాబీ కండువాలు కప్పుకున్నారు. ఈసందర్భంగా శివరాజ్ పాటిల్, సీహెచ్ సత్యనారాయణ, ప్రభుగౌడ్‌లను శాలువాలతో సన్మానించారు. అనంతరం ప్రభాకర్ మాట్లాడుతూ.. గులాబీ శ్రేణులు గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పదేళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతీ గడపకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. 60ఏళ్లు పాలించిన కాంగ్రెస్ వల్ల తెలంగాణ ప్రజలు ఎన్నో కష్టాలు పడ్డారని, మతం పేరుతో బీజేపీ రాజకీయం చేస్తూ ప్రజల మధ్య చిచ్చు పెట్టేందుకు ప్రయత్నిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు అభిపాటిల్, సాయిపాటిల్, గందిగరాజు, జలీల్, పన్నీగౌడ్, కే.రాంరెడ్డి, జైపాల్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, చీల మల్లన్న, అంజనేయులు, ఆకుల శివకుమార్ పాల్గొన్నారు.

## మెదక్‌లో గొడవలు సృష్టిస్తున్న మైనంపల్లి

**బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్ రెడ్డి**



ప్రచారంలో డప్పు వాయిస్తున్న పద్మాదేవేందర్‌రెడ్డి

నిజాంపేట(మెదక్): ప్రశాంతంగా ఉన్న మెదక్‌ను మైనంపల్లి వచ్చి గొడవలు పెడుతున్నాడని బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్ రెడ్డి ఆరోపించారు. మండల పరిధిలోని నస్కల్, జెడ్ చెరువు తండా, నందగోకుల్, నగరం గ్రామాలలో ఆమె ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం రైతులకు 24 గంటల కరెంటు అందిస్తుంటే.. కాంగ్రెస్ నాయకులు 3గంటలు చాలంటున్నారని తెలిపారు. అదే విధంగా రైతుబంధు నిలిపివేయాలని చూస్తున్నారన్నారు. ప్రజలు ఇకనైనా హస్తం పార్టీ కల్లబొల్లి మాటలను నమ్మి మోసపోవద్దని సూచించారు. కర్ణాటకలో కాంగ్రెస్ పాలనను ప్రజలు నచ్చడం లేదని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ దేశెట్టి సిద్ధరాములు, పరిపాటి సుధాకర్‌రెడ్డి, అందె కొండల్‌రెడ్డి, భాజ చంద్రం, బాపురెడ్డి, సులోచన, భాస్కర్‌రావు, కవిత, బాల్ నర్సవ్వ, అనూష, గేమ్ సింగ్, చంద్రవర్ధిని, నరసవ్వ, గౌస్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

## కేసీఆర్‌ను అధిక మెజారిటీతో గెలిపించాలి

**జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి**



మాట్లాడుతున్న లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

కొండపాక(గజ్వేల్): ప్రజా సంక్షేమం కోసం పనిచేసే సీఎం కేసీఆర్‌ను గజ్వేల్‌లో అత్యధిక మెజారిటీతో గెలిపించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. కుకునూరుపల్లి మండల కేంద్రంలో బుధవారం ప్రారంభించే ఎన్నికల ప్రచార నిర్వహణలో భాగంగా ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. కేసీఆర్ అత్యధిక మెజారిటీ సాధించేందుకు ప్రజల వద్దకు ఎలా వెళ్లాలనే విషయంపై చర్చించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ కుకునూరుపల్లి మండలం కావాలనే ఈ ప్రాంత ప్రజల ఎన్నో ఏళ్ల కలను మంత్రి హరీశ్‌రావు చొరవతో సీఎం సాకారం చేశారన్న విషయాన్ని ప్రతీ ఇంటికి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ పిస్క అమరేందర్, ఎన్ఆర్ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు కోల సద్గుణ, సర్పంచ్ కిరణ్‌కుమార్ చారి,కోల శ్రీనివాస్, ఆత్మ కమిటీ డైరెక్టర్ కనుకయ్య, ఎంపీటీసీ భూములుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జంగ్ తెలంగాణ

## శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

**కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్**

సిద్దిపేట ఎడ్యుకేషన్: ఎన్నికల నేపథ్యంలో నిర్వహించే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ సూచించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్నికల అధికారుల శిక్షణ తరగతులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలింగ్ ప్రక్రియ వందశాతం సజావుగా సాగేందుకు ఈ ట్రైనింగ్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. సందేహాలుంటే ఉన్నతాధికారులతో చర్చించాలని సూచించారు. ప్రతీ ఎన్నికల్లో కొత్త మార్గదర్శకాలు, నిబంధనలు వస్తుంటాయని, అవి కీలకంగా ఉంటాయని పేర్కొన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట రిటర్నింగ్ అధికారి గరిమా అగర్వాల్, ఆర్డీఓ రమేష్, తహసీల్దార్ దిలీప్, మున్సిపల్ కమిషనర్ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## ఇక్కడ 'కోడ్' వర్తించదా?

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా కోడ్ అమలులో ఉంటే మండల పరిధిలోని వేచరేణి, గుర్జకుంట గ్రామాల్లో మాత్రం అది కనిపించడం లేదు. ఇందుకు నిదర్శనం ఈ ఫొటోలు. సిద్దిపేట జనగామ ప్రధాన రహదారి పక్కనే ఉన్న పార్టీ ఫాం గోడలపై రాతలను తుడిచివేయకుండా వదిలేసిన అధికారుల తీరును చూసి ప్రజలు ముక్కున వేలు వేసుకుంటున్నారు. - చేర్యాల(సిద్దిపేట)




గుర్జకుంట శివారులో పార్టీ గోడలపై ఉన్న రాతలు




గుర్జకుంట ఎక్స్ రోడ్డులో..



వేచరేణి శివారు కాలనీలో..